క్లుప్తంగా

కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయాలి



కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని ఎంఈఓ బాలభాస్కర రావు అన్నారు. గార్డెన్‌లో ఉత్పత్తయిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించాలని సూచించారు. మండలంలోని శింగరాయి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను అంచనా వేశారు. ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం పథకం మెనూ అమలు, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్‌పీలున్నారు.

సందర్శన..



బల్లంకి హోమియో వైద్యశాలలో విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

వేపాడ: మండలంలోని బల్లంకి హోమియో వైద్యశాలను నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారి ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వెంట గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసి, గుమ్మడి భారతి, గొర్లె నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బానాదిలో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యేకు రెడ్డిపాలెం వద్ద కల్వర్టు నిర్మించాలని, ఎస్సీ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారించాలని కోరారు.

ఎంఆర్‌పీకే ఎరువులు విక్రయించాలి..



దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సూర్యకుమారి

చీపురుపల్లి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.సూర్యకుమారి స్పష్టం చేశారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్లు పరిశీలించారు. ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆక్రమణల గుర్తింపు



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

వేపాడ: మండలంలోని రాయుడుపేట రెవెన్యూలో ఆక్రమణకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం గుర్తించి హద్దులు నిర్ధారించారు. రాయుడుపేట రెవెన్యూలో గెడ్డ వాగు సర్వే నంబర్ .50/1 లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాములమ్మ తెలిపారు.

మహిళల రక్షణ కోసమే 'వన్‌స్టాప్'



విద్యార్థులకు వన్‌స్టాప్ సెంటర్ సేవలను వివరిస్తున్న ఎస్‌ఐ శిరీష

విజయనగరం ఫోర్ట్: మహిళల రక్షణ కోసమే వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటు చేయడం, పనిచేయడం జరుగుతోందని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ శిరీష అన్నారు. నగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై, సెంటర్ సేవలను వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు వన్‌స్టాప్ సెంటర్ సేవల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 181ను సంప్రదించాలని తెలిపారు. తొలుత సెంటర్‌లో బాధితురాలి సమస్యను విని, అవసరాన్ని గుర్తించి సాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ పోలీస్ ప్రొహిబిషన్ ఆఫీసర్ శోభారాణి, కౌన్సిలర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోటలో నిరసనల హోరు..



రౌండ్‌టేబుల్ సమావేశంలో ధ్వజమెత్తిన దళిత ఉద్యమనేతలు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ అయిన ఎస్.కోట శుక్రవారం నిరసనల సెగతో వేడెక్కింది. వేర్వేరు వర్గాలు వేర్వేరు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్ర ప్రతినిధులు 'సంక్షేమ హాస్టళ్లపై పాలకుల నిర్లక్ష్యం' అన్న అంశంపై విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, దళిత సంఘాల నాయకులతో కలిసి దళిత విజ్ఞాన కేంద్రం ప్రతినిధి బి.ఈశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. హాస్టళ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని.. కలెక్టర్ వసతిగృహాలను నెలకు ఒక్కసారైనా పరిశీలించాలని కోరారు. అలాగే మౌలిక వసతుల కల్పన.. పారిశుధ్యం, భోజన పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. 50 రూపాయలకే మూడు పూటలా భోజనం ఎలా వస్తుందో ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు కళ్లు తెరవకుంటే జిల్లా స్థాయి ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు ఉదయ్‌భాస్కర్, జి.అప్పారావు, పి.సూరిదేముడు, బి.ఈశ్వరరావు, పి.అప్పారావు, బి.జీవన్, జి.శ్రీను, డోల కేశవ, ఎస్.కృష్ణ, ఎం.రమణ, కె.కృష్ణ, తదితరులు ప్రసంగించారు.

నిర్వాసితుల నిరసన..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిందాల్ భూ నిర్వాసితులు చేస్తున్న ఆందోళనలో భాగంగా శుక్రవారం స్థానిక రైతులంతా బొడ్డవరలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. నాడు జిందాల్ చేసిన ఒప్పందాలను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం, నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని.. జిందాల్‌తో చేతులు కలిపి స్థానిక గిరిజన, దళిత, పేద రైతు కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారని రైతు సంఘ నాయకుడు చల్లా జగన్ ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



బొడ్డవరలో నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

పదవి కోసం పాకులాడే వ్యక్తి వద్దు..



ఎస్.కోటలో నిరసన తెలుపుతున్న జన సైనికులు

జనకోసం పనిచేసే నాయకత్వం కావాలే తప్ప.. పదవుల కోసం పాకులాడే నాయకులు పార్టీకి అవసరం లేదంటూ జనసైనికులు శుక్రవారం 'కోట'లో కదం తొక్కారు. స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్ వద్ద జన సైనికులు ప్లకార్డులు పట్టుకుని పార్టీ ఇన్‌చార్జ్ ఒ బ్బిన సత్యనారాయణను తొలగించాలని ఆందోళన చేపట్టారు. వారంతా మీడియాతో మాట్లాడుతూ.. సమర్థమైన నాయకత్వం కావాలని కోరారు. అధికారం లేనప్పుడు పార్టీ బలంగా ఉండేదని.. నేడు అధికారం ఉన్నా, ఎక్కడా జనసేన కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒబ్బిన సత్యనారాయణను తొలగించి కార్యకర్తలకు అండగా ఉండే నాయకుణ్ని ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. నిరసనలో గంధవరపు సతీష్, సత్యనారాయణ, దేవా, తదితరులు పాల్గొన్నారు.

• అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వియ్యంపేట పీహెచ్‌సీ సిబ్బంది

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభా సుమారు 160 కోట్లు దాటిందన్నారు. అధిక జనాభా వల్ల ఆరోగ్య సమస్యలు, లింగ వివక్షత, పేదరికం, నిరుద్యోగం, స్థల సమస్యలు, పర్యావరణ సమతుల్యతలు ఏర్పడతాయన్నారు. చిన్న కుటుంబాలే మేలని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో గల మహాత్మా జోతిబాపూలే ఆశ్రమ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

నేడు మండల స్థాయి విస్తృత సమావేశం

వేపాడ: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ముమ్ములూరి జగన్నాథం (జగ్గుబాబు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక సచివాలయం వద్దనున్న ఖాళీ స్థలంలో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్, జీఎఫ్‌సీ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. జీఎఫ్‌సీ అభ్యర్థులు ఎకనామిక్స్, రూరల్ డవలప్‌మెంట్‌లో పీజీ చేసి ఉండాలని తెలిపారు. ఈ నెల 15లోగా దరఖాస్తులు కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని కోరారు. 17వ తేదీన విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో అంగన్‌వాడీ-2 కేంద్రంలో జరిగిన సంఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు వల్లంపూడి ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి వల్లంపూడి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాటూరులో శుక్రవారం మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రం – 2లో ఐసీడీఎస్ పీఓ.. ఏసీపీఓ, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ద్వారపూడి రామకృష్ణతో పాటు మరో ముగ్గురు మహిళలు దౌర్జన్యంగా కేంద్రంలోకి వచ్చి అంగన్‌వాడీ కార్యకర్త రుద్ర వెంకటలక్ష్మి, ఆమె తల్లిపై దాడి చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన ద్వారంపూడి స్నేహలత, ఆమె తల్లిపై అంగన్‌వాడీ కార్యకర్త, ఆమె తల్లి దాడి చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ

• ఎంపీడీఓ సురేష్



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ సురేష్

చీపురుపల్లి: పంచాయతీల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యచరణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఐ.సురేష్ తెలిపారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఇంటింట చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా కొత్తగవిడివీధి, రెడ్డిపేట, బాలుర ఉన్నత పాఠశాల రోడ్, జి.అగ్రహారం, తదితర ప్రాంతాల్లో శుక్రవారం పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో జేసీబీలతో పెంట కుప్పలు తొలగించి, చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఈ పనులను ఎంపీడీఓ సురేష్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

చెత్త సేకరణ కేంద్రం పరిశీలన..

జామి: మండలంలోని జేడీ వలస గ్రామంలో జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ శుక్రవారం పర్యటించి, చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణ, తాగునీరు, పారిశుధ్య పనులు, తదితర అంశాలపై స్థానికులతో చర్చించారు. చెత్తను వేర్వేరుగా విడదీసి కార్మికులకు ఇవ్వాలని సూచించారు. కార్య క్రమంలో ఎంపీడీఓ ఎస్.అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ ఉమా, తదితరులు పాల్గొన్నారు.

• అత్యుత్సాహం తగదు..



రోడ్డు తొలగింపుపై ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

• రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తల వంచొద్దు..
• ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

కొత్తవలస: రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తల వంచొద్దని.. వారి అండదండలు చూసుకుని అత్యుత్సాహం ప్రదర్శించడం తగదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ భవనంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని వివరించారు. ఇటీవల నిమ్మలపాలెంలో రైతుల అవసరాలకై ఇరు గ్రామాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన రోడ్డును ఎంపీడీఓ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపీడీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో తొలగించేందుకు ప్రయత్నించడం సరికాదని ఎమ్మెల్సీ అన్నారు.

ఎవరో చెప్పారని అధికారులు అత్యుత్సాహంతో రోడ్డును తవ్వేందుకు సిద్ధపడడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా నీటిపారుదలశాఖ అధికారుల తీరు దారుణంగా ఉందని మండిపడ్డారు. అనంతరం పలు శాఖల అభివృద్ధిపై సమీక్షించారు. ఇదిలా ఉంటే హౌసింగ్, అంగన్‌వాడీ, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కల శ్రీదేవి, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, ఎంపీడీఓ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

• సన్మానం



బొద్దాంలో బదిలీ ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు వర్రి భాస్కరరావుకు కొట్టాం పాఠశాలకు బదిలీ కావడంతో సహచర ఉపాధ్యాయులు శుక్రవారం ఆయన్ను సత్కరించారు. బొద్దాం పాఠశాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గ, వాసవీమాత



శాకంబరిమాతగా కనకదుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

జామి: ఆషాఢమాస శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు భగవాన్ శర్మ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అలాగే వాసవీమాతను కూడా శాకంబరీదేవిగా అలంకరించగా.. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

మధ్యవర్తిత్వంతో ప్రజలకు మేలు..

• జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ రాజ్‌కుమార్



మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొంతమంది న్యాయవాదులతో కూడిన మధ్యవర్తిత్వం కమిటీ ఏర్పాటు చేశామని, ఈ కమిటీ వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో కక్షిదారులతో ఆయన మాట్లాడుతూ.. కోర్టు కేసులకు సంబంధించి ప్రజలెవ్వరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. పైసా ఖర్చు లేకుండా మధ్యవర్తిత్వ కమిటీలు న్యాయ సహాయం చేస్తాయని చెప్పారు. ఇరువర్గాలు ఇష్టపడితే రాజీ ద్వారా కేసులను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

'సమావేశాన్ని విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వేగేట్ సమీపంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు రాపాక కృష్ణార్జున తెలిపారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడుతో కలసి శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించాల్సి ఉందన్నారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు. మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్ క్రాంతికుమార్, ఫణీంద్రుడు పాల్గొన్నారు.

• బీఎల్‌ఓల పాత్ర కీలకం..



శిక్షణలో మాట్లాడుతున్న గరివిడి తహసీల్దార్ బంగార్రాజు

• గరివిడి తహసీల్దార్ బంగార్రాజు

చీపురుపల్లి: ఎన్నికలకు సంబంధించి పటిష్టమైన ఓటర్ల జాబితాలు రూపొందించడంలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని గరివిడి తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో కొద్ది రోజులుగా జరుగుతున్న బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడే పటిష్టమైన ఓటర్లు జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా అర్హులకు ఓటుహక్కు కల్పించడం.. అనర్హుల పేర్లను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో గుర్ల డిప్యూటీ తహసీల్దార్ వి.నారాయణమ్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని పాల్గొన్నారు.

• రహదారి ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు, నేతలు

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజుపేటలో రూ. 5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు శుక్రవారం ప్రారంభించారు. వర్షాకాలంలో రహదారి అధ్వానంగా తయారవడంతో ఎంపీపీ రూ. 5 లక్షలు మంజూరు చేయడంతో త్వరితగతిన రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ సర్పంచ్, కాంట్రాక్టర్ గుంటమాని గోవింద్, ఎంపీటీసీ సభ్యుడు రాజారావు ఉన్నారు.